క్లుప్తంగా

పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి పలువురు ఆదివారం విరాళాలు అందజేశారు. భద్రాచలం భగవాన్‌కాలనీకి చెందిన మిట్టపల్లి చక్రధర్‌రావు, నవ్య దంపతులు రూ.10,116, బూర్గంపాడు మండలం లక్ష్మీపురానికి చెందిన కైపు సత్యనారాయణరెడ్డి, ఇంద్రజరెడ్డి దంపతులు రూ.5116 విరాళాలు అందజేసినట్లు ఆలయఈఓ ఎస్.రజనీకుమారి తెలిపారు. విరాళాలు అందజేసిన దాతలకు అమ్మవారి శేష వస్త్ర ప్రసాదాలను అందజేశారు.

స్పోర్ట్స్ డ్రెస్ మెటీరియల్ పంపిణీ


స్పోర్ట్స్ మెటీరియల్ పంపిణీ చేస్తున్న జీఎం

ఇల్లెందు: వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2022–23 సంవత్సరానికి కేటాయించిన స్పోర్ట్స్ డ్రెస్ మెటీరియల్‌ను జీఎం జాన్ ఆనంద్ ఆదివారం పంపిణీ చేశారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులందరూ క్రీడలలో పాల్గొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, బొగ్గు ఉత్పత్తిలోనూ క్రీడాస్ఫూర్తితో పనిచేయాలని, కోల్ ఇండియాలో ప్రతిభ కనబరిచిన ఇల్లెందు ఏరియా క్రీడాకారులు అభినందనీయులన్నారు. ఎస్‌వోటూజీఎం మల్లారపు మల్లయ్య, అధికారులు గిరిధర్‌రావు, ధనుంజయ్‌రెడ్డి, సాయిస్వరూప్, ఢిల్లీ శ్రీనివాస్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టులో ప్రతిభ


మాన్విక్‌రత్నం

పాల్వంచరూరల్: జాతీయ స్థాయి టాలెంట్ టెస్టులో మండలంలోని జగన్నాథపురానికి చెందిన బాదర్ల శ్యామ్‌కుమార్, నాగిని దంపతుల కుమారుడైన బాదర్ల మాన్విక్ రత్నం ప్రతిభ చూపాడు. ఈ నెల20న యూనిఫైడ్ కౌన్సిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో జరిగిన టాలెంట్ టెస్ట్‌లో పాల్గొని ప్రతిభ చూపి ఆల్ ఇండియా స్థాయిలో మొదటిస్థానాన్ని కై వసం చేసుకున్నట్టు తల్లిదండ్రులు తెలిపారు. ఈ మేరకు పలువురు మాన్విక్ రత్నంను అభినందించారు.

ఫారెస్టు జూనియర్ అధికారుల కమిటీ ఎన్నిక

ఇల్లెందురూరల్: ఫారెస్టు ఇల్లెందు డివిజన్ జూనియర్ అధికారుల సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుగులోత్ రాంసింగ్, ఉపాధ్యక్షుడిగా బి.కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా బి.మురళీకృష్ణ, నిర్వహణ కార్యదర్శిగా కె.వెంకటేష్, కోశాధికారిగా టి.హరిలాల్, జాయింట్ కార్యదర్శిగా బి.నగేష్ ఎన్నికయ్యారు. రాంసింగ్ మాట్లాడుతూ.. సంఘం బలోపేతం, ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

జాగృతి అయోధ్య ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

చుంచుపల్లి: జాగృతి అయోధ్య సన్నివేశాలతో రూపొందించిన ప్రత్యేక సంచికను ఆదివారం కొత్తగూడెంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కె.వి.రంగాకిరణ్, ఆర్‌ఎస్‌ఎస్ ఖమ్మం విభాగ్ కార్యవాహక సీహెచ్. రామచంద్రరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అయోధ్య సమస్య పరిష్కారం అయ్యే వరకు హిందువులు చేసిన పోరాటాలు, ఉద్యమాలను ఇందులో పొందుపరిచారన్నారు. ఈ కార్యక్రమంలో రాయుడు నాగేశ్వరరావు, చిలుకూరి రమేష్, నరేంద్రబాబు, చింతలచెరువు శ్రీనివాసరావు, గొడుగు శ్రీధర్, ప్రభాకర్, సందీప్ రెడ్డి, గోపమ్మ పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్ పదవికి గండం..?

టేకులపల్లి: మండలంలోని బేతంపూడి సొసైటీ చైర్మన్ పదవికి కూడా గండి పడే ప్రమాదం కనిపిస్తోంది. ఇప్పటికే టేకులపల్లి ఎంపీపీపై అవిశ్వాసం పెట్టడంతో నెగ్గటం జరిగింది. దీంతో ఇక సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్ రావును సైతం అవిశ్వాసంతో దించేందుకు డైరెక్టర్లు పావులు కదుపుతున్నట్లు సమాచారం. 2020 ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల్లో ఐదుగురు కాంగ్రెస్, ఏడుగురు బీఆర్‌ఎస్, ఒకరు ఇండిపెండెంట్ మొత్తం 13 మంది డైరెక్టర్లు గెలుపొందగా ఆనాడు బీఆర్‌ఎస్‌లో ఉన్న లక్కినేనిని అప్పటి ఎమ్మెల్యే హరిప్రియ నాయకత్వంలో ఇండిపెండెంట్ మద్దతుతో చైర్మన్‌గా చేశారు. ఈ మేరకు సొసైటీ చైర్మన్‌గా లక్కినేనిని దించేందుకు మొత్తం 13 మందిలో 8 మంది డైరెక్టర్లు సంతకాలు చేసినట్లు సమాచారం. 9 మంది సభ్యులు మద్దతు ఉంటేనే అవిశ్వాసానికి అవకాశం ఉంటుంది. లక్కినేని వైపు ఆయనతో పాటు మరో నలుగురు డైరెక్టర్లు ఉన్నట్లు తెలుస్తోంది.

హరితహారానికి సిద్ధం..

20 నర్సరీల్లో 2.20 లక్షల మొక్కల పెంపకం

- పండ్లు, పూలు, ఔషధ మొక్కలు ప్రత్యేకం
- ఖాళీ సంచుల్లో మట్టి నింపుతున్న కూలీలు


బ్యాగుల్లో మట్టి నింపుతున్న కూలీలు

సుజాతనగర్: తొమ్మిదో విడత హరితహారంలో భాగంగా మండలాన్ని ఆకుపచ్చగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నారు. ఈ ఏడాది మండలంలోని ఒక్కో గ్రామ పంచాయతీ పరిధిలో 11 వేల మొక్కల చొప్పున 20 గ్రామ పంచాయతీల పరిధిలో 2.20 లక్షల మొక్కలు నాటాలని అధికారులు నిర్ణయించారు. మొక్కల పెంపకానికి అనుగుణంగా వర్షాలు కురవగానే ఆయా గ్రామాల్లోని నర్సరీలలో ఎదిగిన మొక్కలను రహదారులకు ఇరువైపులా, పంటపొలాలు, ఖాళీ స్థలాల్లో నాటనున్నారు. గతంతో హరితహారంలో నాటిన మొక్కల పట్ల సరైన సంరక్షణ లేకపోవడం, వర్షాలు సరిగా కురవకపోవడం తదితర కారణాలతో ఆశించిన స్థాయిలో మొక్కలు ఎదిగేవి కావు. ఈ ఏడాది పెద్దమొత్తంలో మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా మండలంలోని 20 పంచాయతీల్లో 20 నర్సరీలను ఏర్పాటు చేసి ఖాళీ బ్యాగుల్లో మట్టి నింపుతున్నారు. బ్యాగుల్లో మట్టి నింపిన అనంతరం బ్యాగుల్లో 18 రకాల మొక్కలను పెంచి జూన్‌లో వర్షాలు కురవగానే మొక్కలు నాటేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుంటున్నారు.

పండ్లు, పూల మొక్కలకు ప్రాధాన్యం

మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీలలో నర్సరీలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో ఖాళీ సంచుల్లో మట్టి నింపే ప్రక్రియ కొనసాగుతోంది. ముఖ్యంగా నర్సరీలలో గుల్‌మోహర్, రెయిన్ ట్రీ, సీతాఫలం, మునగ, కానుగ, జామ, ఉసరి, బొప్పాయి, బహునియ, ఈత, సీమతంగేడు, దానిమ్మ, నిమ్మ, కర్రీ లీఫ్, చామంతి, మల్లె, గులాభి, మందారం తదితర మొక్కలను పెంచేందుకు అధికారులు సిద్ధమైనారు.

'కృష్ణ తులసి' ప్రత్యేకం

హరితహారంలో భాగంగా ఇంటింటికీ 'కృష్ణ తులసి' మొక్కను పంపిణీ చేయనున్నారు. అనేక ఔషధ గుణాలు కలిగిన ఈ మొక్కలను కూడా నర్సరీలలో పెంచుతున్నారు. ఈ మొక్క నుంచి వాసనతో దోమలు ఉండవని చెబుతున్నారు. ఈ మొక్కలను ఇంట్లో నాటడం ద్వారా దోమల నివారణ సాధ్యమవుతుందని అధికారులు భావిస్తున్నారు.

వర్షాలు కురవగానే నాటుతాం



ప్రభుత్వం ప్రతీ ఏడాది హరితహారం కార్యక్రమాన్ని చేపడుతోంది. అదే మాదిరిగా జూన్‌లో చేపట్టే హరితహారం కార్యక్రమానికి మొక్కలను సిద్ధం చేస్తున్నాం. వర్షాలు కురిసేంతవరకు నర్సరీల్లో మొక్కలను పెంచి వర్షాలు కురవగానే ఆయా గ్రామాలలో నర్సరీలలో సిద్ధంగా ఉన్న మొక్కలను నాటుతాం.

– టి.వెంకటలక్ష్మి, సుజాతనగర్, ఎంపీడీఓ

మొక్కలను సంరక్షించాలి



ఎన్నో లక్షల రూపాయల వ్యయంతో ప్రభుత్వం మొక్కలను పెంచుతోంది. కానీ వాటి పట్ల సరైన నిర్వహణ లేకపోవడంతో నాటిన కొన్ని రోజులకే చనిపోతున్నాయి. దీని వలన ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కత్తి బాలకృష్ణ, సుజాతనగర్

సోషలిస్ట్ విప్లవ నిర్మాత లెనిన్


ఇల్లెందు: లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు


సింగరేణి(కొత్తగూడెం): సీపీఐ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ప్రపంచంలో మొట్టమొదటి సోషలిస్ట్ విప్లవ నిర్మాత లెనిన్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో లెనిన్ శత వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లెనిన్ నాయకత్వంలో జరిగిన రష్యా విప్లవం ప్రపంచ చరిత్రపై తీవ్ర ప్రభావం చూపిందని, అనేక విముక్తి పోరాటాలకు స్ఫూర్తినిచ్చిందని, భారత దేశంలో కార్మిక సంఘాల ఏర్పాటుకు, తెలంగాణలో సాయుధ రైతాంగ పోరాటానికి అక్టోబర్ విప్లవమే స్ఫూర్తి అన్నారు.

లెనిన్ పోరాట స్ఫూర్తి ఆదర్శం..

లెనిన్ అందించిన పోరాట స్ఫూర్తి, తెగింపు ప్రపంచానికి, నేటితరం కమ్యూనిస్ట్ నాయకులు కార్యకర్తలకు స్ఫూర్తిదాయకమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్‌పాషా అన్నారు. సీపీఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో లెనిన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

ఇల్లెందు: పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో లెనిన్ శతవర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు అబ్దుల్ నబి మాట్లాడగా నాయకులు ఆలేటి కిరణ్, మన్యం మోహన్‌రావు, తాళ్లూరి కృష్ణ, కూకట్ల శంకర్, వాసం రాము, రాజు, విజయ్‌కుమార్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో 'కోరం' ప్రత్యేక పూజలు


మేడారంలో ఎమ్మెల్యే కనకయ్య, నాయకులు

ఇల్లెందు: మేడారం సమ్మక్క, సారలమ్మ ఆలయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, లక్ష్మి దంపతులు ఆదివారం ప్రత్యేక పూజ చేశారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయనతోపాటు నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు భారీ సంఖ్యలో మేడారం తరలివెళ్లి వన దేవతలకు పూజలు చేశారు.

ఓటరు నమోదు కార్యక్రమం

జూలూరుపాడు: మండలంలోని జరిగిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం విజయవంతమైంది. ఆదివారం మండలంలోని పోలింగ్ స్టేషన్లను జూలూరుపాడు తహసీల్దార్ శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమ వివరాలను బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ శారద మాట్లాడుతూ ప్రత్యేక క్యాంపేన్‌లో శనివారం, ఆదివారం రెండు రోజుల్లో 133 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. ఆన్‌లైన్ దరఖాస్తులు పరిశీలించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ ఎం.తిరుపతిరావు, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

ఇల్లెందు: ఆదివాసీ సాంస్కృతిక సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా యేడకల వెంకట్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఇల్లెందు పెన్షనర్ల భవన్‌లో ఏర్పాటైన సమావేశంలో ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పాయం నర్సింహారావు, జోగ శ్రీను కార్యదర్శిగా చింత సంపత్, సహాయ కార్యదర్శులుగా ఈసం పాష, రేల రవి, పోతురాజు, కోశాధికారిగా వాసం కిరణ్‌లతోపాటు పదిమంది కార్యదర్శవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

జేపీఏలకు సీనియార్టీ కలపాలి


మాట్లాడుతున్న వజీర్

పాల్వంచ: కోర్ట్ కంటెంప్ట్‌తో 2013 సంవత్సరంలో ఉద్యోగాలు వచ్చిన జూనియర్ ప్లాంట్ అటెండెంట్ లందరికీ సీనియర్టీ కలపాలని, అందుకు తమ యూనియన్ కృషి చేస్తుందని తెలంగాణా స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు ఎంఎ.వజీర్, ప్రధాన కార్యదర్శి డి.రాధకృష్ణ అన్నారు. ఆదివారం యూనియన్ కార్యాలయంలో కోర్ట్ కంటెంప్ట్‌తో ఉద్యోగాలు పొందిన కార్మికులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీపీఈఎస్ రీజనల్ అధ్యక్షుడు వెలిదండ ప్రసాద్, వెంకట్ రమణ, వెంకటేశ్వర చారి, సయ్యద్, నరసింహారావు, చిన్నరాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రంగాకిరణ్‌కు సన్మానం

టేకులపల్లి: బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కేవీ.రంగాకిరణ్‌ను పార్టీ నాయకులు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమంలో నాయకులు దారావత్ ద్రావ్ సింగ్, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు గోపమ్మ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


చుంచుపల్లి: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు


పాల్వంచలో..

చుంచుపల్లి: మండలంలోని గౌతంపూర్ (9 ఇంక్‌లైన్) ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1973–74లో పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం విద్యానగర్ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇటీవల స్నేహితులందరూ కలవాలని నిర్ణయించుకుని అప్పటి గురువులను ఈ సమ్మేళనానికి ఆహ్వానించి వారిని ఘనంగా సన్మానించారు. 50 ఏళ్ల తరువాత స్నేహితులంతా ఒకరినొకరు ఆత్మీయ అనుభవాలు పంచుకున్నారు. అనంతతరం చదువులు నేర్పిన గురువులు కె.బి.రామారావు, పి.ప్రభాకర్‌రావు, డి.శ్రీనివాసరావు, సీహెచ్.సీతారాములమ్మలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కిషన్‌రావు, ఓదేలు, బ్రహ్మానందం, సమ్మయ్య, సత్యనారాయణ, రాజేశ్వరరావు, రాజలింగు, రాయనర్సు, ఇస్మాయిల్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ: పట్టణ శివారు ఆనందాపురం హిల్ వ్యూ రిసార్ట్స్‌లో 1978 సంవత్సరంలో బొల్లేరుగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి, 1980 ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. పూర్వ విద్యార్థులు కాల్వ భాస్కర్, యాకుబ్ పాషా, సుభానీ, రమేశ్, సుందర్ రాజన్, ఉషా రాణి, రుక్మిణి,లోరా, రమేశ్, సుందర్ రాజన్, ఇంటూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'పది' పరీక్షలపై అవగాహన


తల్లిదండ్రులను సన్మానిస్తున్న దృశ్యం

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం పట్టణంలోని కమ్మసత్రంలో పదోతరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోటివేటర్ వంగీపురం శ్రీనాథచారి విద్యార్థులకు అవగాహన కల్పించారు. 2022–23 సంవత్సరంలో పదికి పది జీపీఏ సాధించిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి విద్యా సంస్థల అధినేతలు గొల్లపూడి జగదీష్, మాచవరపు కోటేశ్వరరావు, గొల్లపూడి వీరేంద్ర చౌదరి, పాఠశాల సీఏసీ నటరాజ్, సీఆర్‌వో కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపాళ్లు వైవి.సురేష్, శ్రీనివాస్‌సింగ్, రామ్మూర్తి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల వేట చట్టరీత్యా నేరం


కేసుపల్లి అటవీ ప్రాంతాన్ని తనిఖీ చేస్తున్న సిబ్బంది

జూలూరుపాడు: అడవి జంతువులను వేటాడటం చట్టరీత్యా నేరమని జూలూరుపాడు ఎఫ్‌ఆర్‌ఓ జి.ప్రసాద్‌రావు అన్నారు. ఆదివారం డీఆర్‌ఓ లక్ష్మీనర్సు, సెక్షన్ ఆఫీసర్ మల్లయ్య ఆధ్వర్యంలోని రెండు బృందాలు అటవీ జంతువుల వేట కొనసాగే అనుమానిత అటవీ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఎఫ్ఆర్‌ఓ ప్రసాద్‌రావు, సిబ్బందితో కూడిన బృందం కేసుపల్లి అటవీ ప్రాంతంలోను, డీఆర్‌ఓ లక్ష్మీనర్సు, సెక్షన్ ఆఫీసర్ మల్లయ్య, సిబ్బందితో కూడిన బృందం ఎలుకలొద్దు గ్రామ శివారులో గొత్తికోయలు నివాసం ఉండే ప్రాంతంతోపాటు, పాపకొల్లు బీట్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్‌ఓ ప్రసాద్‌రావు మాట్లాడుతూ.. డీఎఫ్‌ఓ కృష్ణ గౌడ్ ఆదేశాల మేరకు అడవి జంతువుల వేట కొనసాగే అనుమానిత ప్రాంతాలు, గొత్తికోయలు నివాసం ఉంటున్న ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీఓలు చింతా వెంకటేశ్వర్లు, నరసింహారావు, కిషన్, రవి, ఎస్‌కె.రహీం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించుకుందాం



మాట్లాడుతున్న లింగయ్య

ఇల్లెందు: పాలకుల నిర్వాకంతో హరించుకుపోతున్న ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించుకునేందకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని ప్రజాస్వామ్య పరిరక్షణ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దండా లింగయ్య అన్నారు. పట్టణంలోని జవహర్ పాఠశాలలో ఆదివారం ఏర్పాటైన సంఘం ఉమ్మడి జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 76 ఏళ్లుగా భూమి సమస్యపై పోరాడుతున్న ప్రజలను ప్రభుత్వాలు అణచివేస్తున్నాయని, సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల అనుభవాల ఆధారంగా ప్రజాయుద్ధ పంథా ద్వారా ప్రజలు పోరాటాలు నిర్వహించినప్పుడు మాత్రమే పరిష్కారం అవుతాయన్నారు. ఇలాంటి పరిస్థితిలో వ్యవస్థలో ప్రజాస్వామ్య హక్కులను, వారి స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు పోలెబోయిన ముత్తయ్య, జక్కం శ్రీను, లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యం

కొత్తగూడెంఅర్బన్: బహుజన రాజ్యాధికార సాధనే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ పార్లమెంట్ జోనల్ ఇన్‌చార్జ్ అడ్వకేట్ యేర్రా కామేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ హాల్‌లో అసెంబ్లీ అధ్యక్షుడు చెనిగరపు నిరంజన్ కుమార్ అధ్యక్షతన జరిగిన అసెంబ్లీ సమీక్ష సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గ ప్రజలకు శుద్ధమైన మంచినీరు అందించడంలో అదేవిధంగా కనీస అవసరాలైన విద్య, వైద్యం అందించడంలో పాలకులు పూర్తిగా విఫలమవుతున్నారని విమర్శించారు. పార్టీ జిల్లా సలహాదారు గంధం మల్లికార్జున్‌రావు, జిల్లా మహిళా కన్వీనర్ ఎర్రంశెట్టి రాజేశ్వరి, సాయి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగుల రవికుమార్, మాలోత్ వీరు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన


రికార్డులు తనిఖీ చేస్తున్న తహసీల్దార్

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కేశవాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలోని 21, 22 నంబర్ల పోలింగ్ బూత్‌లను ఆదివారం తహసీల్దార్ నాగరాజు సందర్శించి పరిశీలించారు. పోలింగ్‌కేంద్రంలో సౌకర్యాలను తనిఖీచేశారు. ఆర్‌ఐలు హచ్యా, రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా రథయాత్ర..


పాల్వంచ: పట్టణంలో రథయాత్రలో భక్తులు

పాల్వంచ: నేడు అయోధ్యలో శ్రీరామ జన్మభూమి మందిరం నందు ప్రాణ ప్రతిష్ఠ పురస్కరించుకుని ఆదివారం పట్టణంలో శ్రీరామ సేన వాహిని ఆధ్వర్యంలో రథయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాలు, నృత్యాలతో ప్రదర్శన సాగింది. దారి పొడవునా భక్తులు అన్నప్రసాదాలు, మంచినీళ్ల ప్యాకెట్లు పంపిణీ చేవారు. అదేవిధంగా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వేలాది మందికి పానక ప్రసాదం, నల్లా సురేశ్ రెడ్డి ఆధ్వర్యంలో పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. వేణు, ఎస్‌వీఆర్‌కె.ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.


జెండాలతో భక్తులు

ఇల్లెందు: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను హర్షిస్తూ బాలాజీ రామ మందిర్ నుంచి రామ భక్తులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బాలాజీ రామ మందిర్ నుంచి పాతబస్టాండ్, జగదాంబసెంటర్, కరెంటాఫీసు మీదుగా తిరిగి ఆంబజార్ వరకు ర్యాలీ కొనసాగించారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో..

అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని పట్టణంలోని గాంధీచౌక్ ఉమాగణపతి ఆలయం నుంచి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సీతారాముల రథోత్సవం నిర్వహిస్తున్నట్లు వాసవీక్లబ్ పట్టణ శాఖ అధ్యక్షుడు పుల్లూరి సతీష్ తెలిపారు. బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం ముగిసే వరకు ఆలయంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

అక్షింతలు పంపిణీ


కొత్తగూడెం టౌన్ రామాలయంలో పూజలు

టేకులపల్లి: అయోధ్య నుంచి వచ్చిన రాముడి అక్షింతలను పంపిణీ చేసే కార్యక్రమం ముమ్మరంగా జరుగుతోంది. ఆదివారం మండలంలోని కోయగూడెం పంచాయతీ దంతెలతండా గ్రామంలో అక్షింతలను ఇంటింటికీ వెళ్లి భక్తి శ్రద్ధలతో అందజేశారు. ఈ కార్యక్రమంలో భూక్య రమేష్, సందీప్, సురేష్, రమేష్, ప్రసాద్, రామారావు, పకీర్, నాగు, అశోక్, మోహన్, సాయి, మంగీలాల్, బాబులాల్, నవీన్, పవన్ పాల్గొన్నారు.


టేకులపల్లి: అక్షింతలు పంపిణీ..


ఇల్లెందు: బాలాజీ రామ మందిరంలో భజనలు..

రామాలయం ముస్తాబు..



టేకులపల్లి: రాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నేపథ్యంలో మండలంలో వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండల కేంద్రంలోని శ్రీకోదండ రామాలయంతో పాటు అన్ని గ్రామాల్లో ఆలయాల్లో విద్యుత్ దీపాలతో అలంకరణలు, సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. టేకులపల్లిలో అన్నదానం కోసం ఏర్పాట్లు చేశారు.